నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
13 | హైదరాబాద్, ఆదివారం 10 మార్చి 2024 | HYDERABAD

శేషవాహనంపై శ్రీనివాసుడు

జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వేంకటేశ్వ రస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివా రిని చిన్న శేషవాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు. ఈ సంద ర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి గోవిందుడిని దర్శించుకున్నారు. సాయంత్రం స్వామివారికి హంసవాహన సేవ నిర్వహించారు.

– బంజారాహిల్స్, మార్చి 9

హియర్ ఫోన్స్‌తో.. పట్టాలపై నడుస్తుండగా

కాచిగూడ,మార్చి 9: హియర్ ఫోన్స్ పెట్టుకుని పట్టాల పక్కన నడు చుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. కాచి గూడ హెడ్‌కానిస్టేబుల్ చిమ్నానా యక్ కథనం ప్రకారం. కందికల్‌గేట్‌కు చెందిన ఆర్.ప్రతాప్(22) కూలీ. శుక్రవారం రాత్రి ఉప్పుగూడ–ఫలక్‌నుమా రైల్వేస్టేషన్ల మధ్య పట్టాల పక్కన నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమా చారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలిం చారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తు న్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

టీ హబ్‌లో ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్

సిటీబ్యూరో, మార్చి 9 (నమస్తే తెలంగాణ): ప్రపంచ వ్యాప్తంగా రోజు రోజుకు కృత్రిమ మేధస్సు(ఆర్టి ఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)కు ప్రాధాన్యత గణనీయంగా పెరుగు తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు ఏఐ పట్ల ప్రత్యేక ప్రాజెక్టులను రూపొందిస్తున్నాయి. ఇప్పటికే గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో ఐటీ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్ (టీ-ఎయిమ్)ను ఏర్పాటు చేసింది. ఏఐ వినియోగాన్ని ప్రభుత్వ శాఖల్లో అమలు చేసేందుకు ప్రత్యే కంగా ప్రాజెక్టులను చేపట్టింది. సరి కొత్త ఆవిష్కరణలకు కేంద్రంగా ఉన్న టీ హబ్‌లో కొత్తగా ఏఐ, ఎంఎల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం, టీ హబ్ సంయు క్తంగా మ్యాథ్ పేరుతో ఏఐ, ఎంఎల్ సీఓఈని ఏర్పాటు చేశామని టీహబ్ ప్రతినిధి తెలిపారు. కొత్తగా ఏఐ టెక్నాలజీతో ప్రాజెక్టులు చేపట్టే వారికి, స్టార్టప్‌లను ఏర్పాటు చేయా లన్న ఆలోచన ఉన్న వారికి మద్దతుని చ్చేలా ఈ కేంద్రం పనిచేస్తుందని, దీనికి కేంద్ర ప్రభుత్వం నుంచి సహ కారం ఉంటుందని తెలిపారు.

గ్రేటర్@35.6డిగ్రీలు

సిటీబ్యూరో, మార్చి 9 (నమస్తే తెలంగాణ): గ్రేట ర్‌లో ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గు ముఖం పట్టాయి. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు గ్రేటర్‌లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 35.6 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.5 డిగ్రీలు, గాలిలో తేమ 33 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

ఐకియా టూ చార్మినార్.. మహా శివరాత్రిని పురస్కరించుకొని ఐకియా నుంచి చార్మినార్ వరకు సైక్లింగ్ రైడ్ పూర్తి చేసిన హైదరాబాద్ సైక్లిస్టు గ్రూప్

నగరాభివృద్ధే లక్ష్యం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- నగరంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభం
- అభివృద్ధికి అడ్డుపడే వారిని నగర బహిష్కరణ చేస్తాం
- అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తాం
- పాల్గొన్న మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబు

రూ. 50వేల కోట్లతో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ చేపడుతాం

సిటీబ్యూరో, మార్చి 9(నమస్తే తెలంగాణ)/ఎల్బీనగర్/ఉప్పల్ : హైదరాబాద్ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. శనివారం ఎల్బీనగర్ నియోజకవర్గంలోని బైరామల్‌గూడ లెవల్-2 ఫ్లైఓవర్, ఉప్పల్ నల్ల చెరువు వద్ద, పెద్ద చెరువు వద్ద నిర్మించిన ఎస్టీపీలను మంత్రులు పొన్నం, శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం మాట్లాడుతూ... హైదరాబాద్ పురోగతికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు. అభివృద్ధికి కొనసాగింపుగా రూ. 193 కోట్లతో నిర్మించిన లెవల్ – 2 ఫ్లైఓవర్‌ను ప్రారంభించామన్నారు. హైదరాబాద్‌లోని ప్రతి కాలనీ, బస్తీల్లో నుంచి మురుగునీటిని శుద్ధి చేసేలా ఎస్టీపీలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఉప్పల్ ప్రాంత సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. చెరువులు, ప్రభుత్వ స్థలాల కబ్జా విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదని అధికారులను సీఎం ఆదేశించారు.

మూసీ ఒక వరం..

ఒకప్పటి జీవనది మూసీ నిర్లక్ష్యం కారణంగా కాలుష్య కాసారంగా మారిందన్నారు. దీంతో హైదరాబాద్‌లో ఉత్పత్తయ్యే కాలుష్య వ్యర్థాలు 55 కిలోమీటర్ల దూరం మూసీ ద్వారా ప్రవహించి నల్గొండ జిల్లాలో వేల ఎకరాలను కలుషితం చేస్తోందన్నారు. అందుకే రూ. 50వేల కోట్లతో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్యక్రమం చేపట్టి... శాపంలా మారిన మూసీని తీర్చిదిద్దుతామన్నారు. లండన్‌లోని థేమ్స్ రివర్ తరహాలో అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, వైబ్రంట్ తెలంగాణ -2050 పేరిట మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు తెలిపారు. అవుటర్ రింగు రోడ్డు వరకు ఉన్న మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను జీహెచ్ఎంసీలో విలీనం చేసి బృహత్ హైదరాబాద్ నగరాభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే సుమారు 350 కిలోమీటర్లలో త్వరలో రానున్న త్రిబుల్ ఆర్ ప్రాజెక్టు నుంచి తెలంగాణ సరిహద్దుల వరకు మూడు ప్రాంతాలుగా విభజించి అభివృద్ధి చేస్తామన్నారు. ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణకు కొందరు అడ్డుపడే ప్రయత్నాలు చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. అభివృద్ధికి అడ్డుపడే వారిని నగర బహిష్కరణ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేశం, బొగ్గారపు దయానంద్ గుప్తా, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, చామకూర మల్లారెడ్డి, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కాంగ్రెస్ నాయకుడు మధుయాష్కీ గౌడ్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్లు, అధికారులు, నేతలు పాల్గొన్నారు.

డబుల్ డెక్కర్ కారిడార్‌కు శంకుస్థాపన...

కండ్లకోయ వద్ద ఎలివేటెడ్ డబుల్ డెక్కర్ కారిడార్ నిర్మాణానికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. జాతీయ రహదారి-44పై ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి మీదుగా 5.3కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌ను రూ.1580 కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం పూర్తయితే సికింద్రాబాద్‌లో సర్వ సాధారణంగా కనిపించే ట్రాఫిక్ సమస్యలు తొలగిపోతాయన్నారు. ఈ ప్రాజెక్టు వల్ల మేడ్చల్, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు రవాణా సదుపాయం మెరుగుపడుతుందన్నారు.

ఎల్బీనగర్ ప్రజల సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

గతంలో మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడిగా రేవంత్‌రెడ్డిని గెలిపించిన ఎల్బీనగర్ ప్రజల సమస్యలను తీర్చాల్సిన బాధ్యత ఆయనపై ఉందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు తీసుకున్న సందర్భంగా ఎల్బీనగర్ ప్రజలకు న్యాయం చేయాలన్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత సీఎంపై ఉందన్నారు.

స్థానిక సమస్యల పై సీఎంకు విన్నవించిన ఉప్పల్ ఎమ్మెల్యే ...

నల్లచెరువు వద్ద ఎస్టీపీ పనుల ప్రారంభం సందర్భంగా నియోజకవర్గంలోని సమస్యలను ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. రోడ్లు, డ్రైనేజీ, చెరువులు తదితర సమస్యలను తెలియజేశారు. ప్రధానంగా చెరువుల అభివృద్ధి, పూడికతీత, ప్రభుత్వ స్థలాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సీఎంకు అందజేశారు.

నేడు మరో నాలుగు ఎస్టీపీలు..

- మీరాలం ట్యాంక్ వద్ద ప్రారంభించనున్న సీఎం రేవంత్‌రెడ్డి
- గత కేసీఆర్ ప్రభుత్వంలో పనులు
- కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రారంభం

సిటీబ్యూరో, మార్చి 9 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో వందకు వంద శాతం మురుగునీటి శుద్ధి లక్ష్యంగా గత కేసీఆర్ ప్రభుత్వం రూ. 3866.41కోట్ల వ్యయంతో 1259.50 ఎంఎల్‌డీల సామర్థ్యంతో చేపట్టిన 31 ఎస్టీపీలు విడతల వారీగా అందుబాటులోకి వస్తున్నాయి. ఐదు సర్కిళ్లలో ఆధునాతన సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ టెక్నాలజీతో ఈ కొత్త ఎస్టీపీల నిర్మాణం జరుగుతుండగా.. 31 ఎస్టీపీల్లో గత అసెంబ్లీ ఎన్నికల ముందే కోకాపేట, దుర్గం చెరువు ఎస్టీపీలను అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. తుది దశలో ఉన్న ఈ ప్రాజెక్టు పనుల్లో భాగంగా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పనులను పూర్తి చేసుకున్న ఎస్టీపీలను ప్రారంభిస్తున్నది. ఇందులో భాగంగానే శనివారం సీఎం రేవంత్‌రెడ్డి నల్ల చెరువు, పెద్ద చెరువుల వద్ద ఎస్టీపీలను ప్రారంభించారు. అలాగే నేడు మీరాలం చెరువు వద్ద రూ. 41.50 ఎంఎల్‌డీల సామర్థ్యంతో రూ.125.19కోట్లతో చేపట్టిన నాలుగు ఎస్టీపీలను ఆదివారం సీఎం ప్రారంభించనున్నారు. ఈ మేరకు జలమండలి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

మీరాలం ఎస్టీపీ వివరాలు..

హైదరాబాద్ నగరంలో సీవరేజీ మాస్టర్ ప్లాన్, ఎస్టీపీల ప్రాజెక్టు ప్యాకేజీ-2లో భాగంగా మీరాలం చెరువు వద్ద నాలుగు ఎస్టీపీలను నిర్మించారు.

నిర్మాణ వ్యయం - రూ. 125.19 కోట్లు

సామర్థ్యం - 41.5 ఎంఎల్‌డీలు(ఒక్కొక్కటి 10.375 ఎంఎల్‌డీల సామర్థ్యంలో 4 ఎస్టీపీలు)

వినియోగించిన సాంకేతికత – సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ (ఎస్‌బీఆర్)

ప్రయోజనం పొందే ప్రాంతాలు : రిజ్వాన్ కాలనీ, మైలార్ దేవ్‌పల్లి, బాబుల్ రెడ్డి నగర్, పెద్దకుంట, మొఘల్ కాలనీ, సులేమాన్ నగర్, ఎస్టీఆర్ నగర్, ఇందిరానగర్, శివరామ కాలనీ, మిర్ మహ్మద్ పహాడి, ఆదర్శనగర్, హసన్ నగర్, అన్సారీ రోడ్, శివ రాంపల్లి నాలా ఏరియా తదితర ప్రాంతాలకు మురుగునీటి సమస్య తీరనుంది.

భాగ్యనగరం.. పరిశోధన నిలయం

- నగరంలోని పరిశోధన సంస్థలకు క్యూ కడుతున్న విద్యార్థులు
- రెండు నెలలుగా సందడిగా మారిన పలు రీసెర్చ్ సెంటర్లు
- ఐఐసీటీ, సీసీఎంబీ, సీడీఎఫ్‌డీలకు విద్యార్థుల నుంచి విశేష ఆదరణ

హైదరాబాద్ కేంద్రంగా 40కిపైగా పరిశోధన కేంద్రాలు ఉన్నాయి. మొక్కల నుంచి మొదలుకుంటే జంతు సంబంధిత పరిశోధనలు హైదరాబాద్ వేదికగా జరుగుతాయి. ఇందులో ప్రధానంగా హబ్సిగూడలోని సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలార్ బయాలజీ, జాతీయ పోషకాహార సంస్థ, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ, ఎన్‌జీఆర్ఐ తోపాటు, ఫుడ్ టెక్నాలజీ రీసెర్చ్ సెంటర్, సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నోస్టిక్స్, ఎన్ఆర్ఎస్సీ వంటి పలు పరిశోధన సంస్థలన్నీ కూడా లైఫ్ సైన్సెస్ రంగంలో ఆధునిక పరిశోధనలు, అధ్యయనాలకు నిలయంగా నిలుస్తున్నాయి. ఈ క్రమంలో అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్‌లో ఉన్న పరిశోధన సంస్థలకు గుర్తింపు ఉండటంతో స్టడీ టూర్లకు వచ్చే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడానికి కారణంగా మారింది.

సైన్స్ టూరిజం తరహాలో...

బెంగళూరులోని సైన్స్ సిటీ తరహాలో హైదరాబాద్ కేంద్రంగా ఉన్న పరిశోధన సంస్థలను సందర్శించడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో గడిచిన రెండు నెలల వ్యవధిలో కేరళ, తమిళనాడుతో పాటు ఉత్తర భారతం నుంచి వచ్చే విద్యార్థుల బృందాల సంఖ్య 40కిపైనే ఉంటుంది. ముఖ్యంగా పాఠశాలల విద్యార్థుల కంటే కాలేజీలు, పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ చదువుతున్న విద్యార్థులు కూడా వైజ్ఞానిక సందర్శనలకు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా సీఎస్ఐఆర్ అనుబంధ సంస్థలైన సీఎస్ఐఆర్ సీసీఎంబీ, ఎన్‌జీఆర్, సీడీఎఫ్‌డీ వంటి అనుబంధ సంస్థలను విజిట్ చేసేందుకు ప్రాధాన్యతనిస్తున్నారు. సందర్శనకు వచ్చిన విద్యార్థులకు తమ సెంటర్‌లోని ల్యాబోరేటరీలను, మోడల్ బయోగ్యాస్ ప్లాంట్, కెమికల్ ల్యాబోరేటరీ, పాలిమర్ ప్రాసెసింగ్ ల్యాబ్‌లను సందర్శించే వీలు కల్పిస్తా మని ఐఐసీటీ పరిశోధకులు తెలిపారు.

పుస్తకాల్లో చదివే ఎన్నో పరిశోధన ఫలితాలకు అక్కడే సమాధానం దొరుకుతుంది. రసాయనిక చర్యల నుంచి మొదలుకుంటే జన్యువుల్లో జరిగే జీవ క్రియల వరకు విషయాలను స్వయంగా సంబంధిత పరిశోధకులే వివరిస్తారు. అందుకే వైజ్ఞానిక ప్రదర్శనలకు వేదికలుగా నిలిచే పరిశోధనాభివృద్ధి సంస్థలకు విశేషమైన ఆదరణ వస్తున్నది. గడిచిన రెండు నెలల వ్యవధిలో ఏకంగా 40కిపైగా విద్యార్థుల బృందాలు నగరంలోని పలు పరిశోధన సంస్థలను సందర్శించాయి. స్టడీ టూర్లకు వచ్చేవారిలో రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటు, ఇతర రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, యువ పరిశోధకులు కూడా ఆసక్తి చూపుతున్నారు. దీంతో లైఫ్ సైన్స్ రంగంలో హైదరాబాద్ విజ్ఞానాన్ని పంచే వేదికగా నిలుస్తున్నది.
- సిటీబ్యూరో, మార్చి 9 (నమస్తే తెలంగాణ)

ఉన్నత విద్యా, ఉద్యోగాలపై అవగాహన

స్టడీ టూర్లకు వచ్చే వారిలో ఎక్కువగా డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులే ఉంటున్నారు. ఎక్కువగా డిగ్రీ తర్వాత ఉన్నత విద్యా అవకాశాలు, ఉద్యోగ అవకాశాలపై అవగాహన పెంచుకోవడంలో ఈ టూర్లతో సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ల్యాబోరేటరీలో జరిగే పరిశోధనలపై ప్రయోగాత్మక విశ్లేషణ ద్వారా అవగాహన పొందడానికి ఆస్కారం ఉంటుందని చెబుతున్నారు.

మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు

రూ.306 కోట్ల చెక్కు అందజేసిన సీఎం

మేడ్చల్, మార్చి 9(నమస్తే తెలంగాణ) : స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీలేని రుణాలు అందించి, ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కండ్లకోయలో ఎలివేటెడ్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళల ఆత్మీయ సమ్మేళనంలో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళా సంఘాలు సబ్‌స్టేషన్ వద్ద సోలార్ ప్యానెల్‌ను ఏర్పాటు చేసుకుని, ప్రభుత్వానికి కరెంట్ అమ్మేలా అవకాశం కల్పిస్తామన్నారు. ఈ నెల 11న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని కూడా ప్రవేశ పెట్టనున్నట్టు వెల్లడించారు. విజయ డెయిరీకి పాలమ్మిన వారికి రూ.4 బోనస్‌ను అందజేస్తామన్నారు. అనంతరం మహిళా సంఘాలకు రూ.306.12 కోట్ల రుణాల చెక్కును సీఎం మహిళా సంఘాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, స్పీకర్ గడ్డం ప్రసాద్, ఎమ్మెల్యే మల్లారెడ్డి, జడ్పీ చైర్మన్ శరత్ చంద్రారెడ్డి, జిల్లా కలెక్టర్ గౌతమ్ పాల్గొన్నారు.

ఈ ఏడాదిలోనే మరో 8 ఎస్ఆర్‌డీపీ ప్రాజెక్టులు.!

ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్న గత కేసీఆర్ ప్రభుత్వ ఫలాలు

నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అధికారుల చర్యలు

సిటీబ్యూరో, మార్చి 9 (నమస్తే తెలంగాణ) : వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి ప్రాజెక్టు (ఎస్.ఆర్.డి.పి) ఫలాలు ఒక్కొక్కటిగా అందుబాటులోకి వస్తున్నాయి. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దాలన్న సంకల్పంలో భాగంగా గత కేసీఆర్ ప్రభుత్వం సిగ్నల్ రహిత ప్రయాణమే లక్ష్యంగా రూ.5112.36 కోట్ల అంచనా వ్యయంతో 47 ప్రాజెక్టులను చేపట్టింది. వాటిలో తాజాగా బైరామల్‌గూడ సెకండ్ లెవల్ ఫ్లై ఓవర్‌తో పాటు జీహెచ్ఎంసీ సౌత్ వ్యాలీలో 34 ప్రాజెక్టులు ... హెచ్ఎండీఏ, ఆర్ అండ్‌బీతో మరో మూడు కలిపి మొత్తం ఇప్పటి వరకు 37 చోట్ల అందుబాటులోకి వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది చివరి నాటికల్లా మరో 8 ప్రాజెక్టులు విడతల వారీగా అందుబాటులోకి రానున్నాయి. ఈ మేరకు జీహెచ్ఎంసీ ప్రాజెక్టు విభాగం అధికారులు ప్రాజెక్టుల వారీగా నిర్దేశిత గడువులోపు పనులను పూర్తి చేసేలా లక్ష్యాన్ని ఖరారు చేశారు. మొత్తంగా గత కేసీఆర్ ప్రభుత్వంలో నాటిన ఎస్ఆర్‌డీపీ వృక్షానికి సంబంధించిన ఫలాలు ఒక్కొక్కటిగా గ్రేటర్ ప్రజలకు రేవంత్‌రెడ్డి సర్కారు అందిస్తున్నది.

ఈ ఏడాదిలో వచ్చే మరిన్ని ప్రాజెక్టులు ఇవే ..

ప్రాజెక్టు	వ్యయం (రూ.కోట్లలో)	నిర్దేశిత గడువు
బైరామల్‌గూడ ఎల్‌హెచ్ఎస్ లూప్ (2)	21.63	ఏప్రిల్ 24
బైరామల్‌గూడ ఆర్‌హెచ్ఎస్ లూప్ (1)	22.30	మే 24
శాస్త్రీపురం ఆర్వోబీ	71	జూలై 24
ఫలక్‌నుమా ఆర్వోబీ	47.10	జూలై 24
శిల్పా లేఅవుట్ ఫ్లై ఓవర్ (స్టేజ్-2)	275	సెప్టెంబర్ 24
నల్గొండ క్రాస్‌రోడ్ టూ ఒవైసీ హాస్పిటల్ జంక్షన్		
4లేన్ ఎలివేటెడ్ కారిడార్	370	డిసెంబర్ 24
ఆరాంఘర్ టూ జూపార్కు ఫ్లై ఓవర్	636.80	డిసెంబర్ 24
ఉప్పల్ జంక్షన్ ఫ్లై ఓవర్	311	డిసెంబర్ 24

ఓటింగ్ శాతం పెరిగేలా..

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కార్యాచరణ మొదలు పెట్టిన ఈసీ

- ఓటు నమోదుకు మరోసారి అవకాశం
- గత అసెంబ్లీ ఎన్నికల్లో తగ్గిన పోలింగ్ శాతం
- ఇప్పటి నుంచే అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం
- స్వీప్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాల నిర్వహణకు కలెక్టర్ ఆదేశం
- ఇటీవల జిల్లాలో పర్యటించిన రాష్ట్ర స్వీప్ కన్సల్టెంట్ భవానీశంకర్

రంగారెడ్డి, మార్చి 9 (నమస్తే తెలంగాణ) : ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదు కావడంతో కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు కార్యాచరణను మొదలెట్టింది. అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి ఓటర్లుగా వారి పేర్లను నమోదు చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్ప టికే పలు దఫాలుగా ఓటు నమోదుకు అవకాశం కల్పించిన ఈసీ యువతకు మరో అవకాశాన్ని ఇచ్చింది. అలాగే.. సిస్టమెటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్) ఆధ్వర్యంలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం సన్నాహాలు చేస్తున్నది. ఓటింగ్ సందర్భంగా ఓటర్లు ఇబ్బంది పడకుండా ఉండేందుకు సహాయక పోలింగ్ కేంద్రాల ఏర్పా టుపైనా అధికారులు దృష్టి సారించారు.

అసెంబ్లీ ఎన్నికల్లో 59.96 శాతమే..

గతేడాది చివరలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌లో జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఓటర్లు పోటెత్తగా..పట్టణాల్లోని ఓటర్లు మాత్రం పెద్దగా ఆసక్తి చూప లేదు. 2018 ఎన్నికల్లో 62% పోలింగ్ కాగా.. తాజా ఎన్నికల్లో 59.96 శాతమే నమోదైంది. గత ఎన్నికలతో పోలిస్తే..2 శాతానికి పైగా ఓటర్లు తగ్గారు. ఇబ్ర హీంపట్నం నియోజకవర్గంలో 74.93%, ఎల్బీనగర్‌లో 49.07%, మహేశ్వరం లో 55.39%, రాజేంద్రనగర్‌లో 55.83%, శేరిలింగంపల్లిలో 48.75%, చేవెళ్ల లో 74.18%, కల్వకుర్తిలో 83.26%, షాద్‌నగర్‌లో 82.09% పోలింగ్ నమో దైంది. అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గడంతో ఈసారి అర్హులైన ప్రతి ఒక్క రినీ గుర్తించి ఓటర్లుగా పేర్లు నమోదు చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

కొత్తగా ఓటు నమోదుకు అవకాశం..

ఇటీవల రెండుసార్లు ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం అవకాశం కల్పిం చింది. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను జిల్లా అధికారులు విడుదల చేశారు. అర్హులైన వారందరూ ఓటర్లుగా తమ పేర్లను నమోదు చేయించుకునేందుకు ఎన్నికల సంఘం తాజాగా మరోసారి అవకాశం కల్పించింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటికి 18 ఏండ్లు నిండిన యువతీయువకులు కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతోపాటు జాబితాలో మార్పులు, చేర్పులు, అనర్హుల పేర్లను తొలగించుకోవచ్చు. సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో ఫారాలను పూర్తి చేసి అందజేసేలా బీఎల్‌వోలు శ్రద్ధ తీసుకుంటున్నారు. నామినేషన్ల ఘట్టానికి పది రోజుల ముందు వరకూ ఈ ప్రక్రియ కొనసాగనున్నది. ప్రస్తుతం జిల్లాలో 35,91,987 మంది ఓటర్లుండగా.. స్వీప్ కార్యక్రమంలో ఓటు హక్కు తోపాటు ఓటు వినియోగంపైనా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు జిల్లాలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇటీవల జిల్లాలో రాష్ట్ర స్వీప్ కన్సల్టెంట్ భవానీశంకర్ పర్యటించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అదేవిధంగా ఓటింగ్ సందర్భంగా ఇబ్బందులు తలెత్తకుండా 1,500 మంది ఓటర్ల కంటే ఎక్కువ ఓట్లు ఉంటే సహాయక పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసే దిశగా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో 3,369 పోలింగ్ కేంద్రాలుండగా...ఈ సంఖ్య లోక్‌సభ ఎన్నికల నాటికి మరింతగా పెరిగే అవకాశం ఉన్నది.